# ఇది దారి కాదు

రాజు మనస్సంతా అదే విషయం కమ్మేసింది.

నాయుడిగారి మాటలూ, నరసయ్య సలహా - రాజు చెవుల్లో మార్మోగుతున్నై.

ఇక, ఈ వ్యవహారం సానుకూలమయ్యే లక్షణాలు కనపడటం లేదతనికి.

సాయంత్రం...

కాలువగట్టుమీద నాయుడుగారు కలిశారు రాజుకి. అంతకు ముందే ఆయన ఇంటికి వెళ్ళి వచ్చాడు రాజు. అప్పుడు ఆయన ఇంట్లో లేడు. ఆ విషయం చెప్పి మాటలు కలిపేడు, రాజు.

" నీటి ఎద్దడి గురించి పెద్దోళ్ళంతా వోసారి మాట్లాడుకుని ఏదన్నా సెయ్యాల "

నాయుడుగారు రాజుకేసి సాలోచనగా చూశారు. "ఏఁవిటి నువ్వనేది ? ఎవరేం మాట్టాడుకున్నా జరిగేదేం వుంది. ఉన్నట్టుండి ఆకాశగంగనో, పాతాళగంగనో పుట్టించలేంగదా " అన్నారు.

విషయం అవగతమైపోయింది, రాజుకు.

ఓ పావుగంట ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చుని లేచి వచ్చేశాడు.

కనిచీకటి పడింది.

దార్లో – వరసయ్య తగిలేడు. ఆయనతోనూ ప్రస్తావించాడు. విషయమూ అదే, సమాధానమూ అదే.

కాకుంటే,

ఆయన వో వుచిత సలహా పారేశాడు. "ఎమ్మో అయ్యి ఆరేళ్ళయ్యింది. ఉద్యోగం సద్యోగం ఎట్టాగూ రాకుండా వుండె. ఎలక్షన్లొస్తున్నాయిగా. నువ్వే నిలబడు. గెలిచినాక ఇట్టాంటి వన్నీ సేయిద్దువుగాని."

వరసయ్య మాటల్లో – వ్యంగ్యం, ఎద్దేవా!

నాయుడుగారి మాటల్లో చిరాకు, విసుగు!

వరసయ్య సలహా కంటే, నాయుడుగారి ఉదాశీనతే రాజుని ఎక్కువ బాధించింది. కారణం – నాయుడుగారు సమర్థుడు. సమర్థత వుండీ, ఆయన ఈ సమస్యని తేలిగ్గా తీసుకోవడం నచ్చలేదు, రాజుకి.

ఇంటికొచ్చి వేపచెట్టుకింద కుక్కిమంచంలో వాలేడు.

ఊరూ వాడా ఇబ్బందిపడుతున్నా, ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడం పరిపాటయిపోయింది, పల్లెలో. ఏంచేయాలి?

ఆలోచనల్లోకి జారి, ఆకాశంకేసి చూశాడు, రాజు.

కోరంటికం అత్తారింటికిపోయే ఆడపిల్ల మనస్సులా వుంది, ఆకాశం. గొడ్డుమోతు మేఘాలు పళ్ళికిలిస్తూ పలచబడిపోతున్నై.

" ఈ ఏటికింక వానపడదు " సుబ్బయ్య నిన్న గొణుక్కున్నాడు ; తను విన్నాడు.

" వేరుశనగ మాడిపోయింది. ఈ ఏడెట్టా గడపాలో తెలీడం లేదు " పుల్లయ్య గుండెను మండించుకున్నాడు. ఆ సెగల్ని తాను రుచిచూశాడు.

ఏం చెయ్యాలి ? — ఏం చెయ్యాలో తెలియదు ! ఏ పరిష్కారమూ తోచదు.

అస్థిమితంగా లేచి మంచంలో కూర్చున్నాడు. ఏదో ఒకటి చెయ్యాలి. చేతులు ముడుచుక్కూర్చోకూడదు.

రాజు మనస్థితి గందరగోళంగా మారింది.

ఉన్నట్టుండి, రబ్బరుబంతిలా పైకి లేచాడు.

విసవిసా నడుచుకుంటూ ప్రతాపరెడ్డి ఇంటికేసి సాగేడు.

*　　　*　　　*

అప్పటికి రాత్రి ఎనిమిది గంటలయింది.

ఊరి మీద పడి జులుం చలాయిస్తున్నది – చీకటి. కంపముళ్ళచెట్ల పక్కగా కీచురాళ్ల రొద వినిపిస్తున్నది.

దేవళం పక్క వీధి నుంచీ పంచాయితీ ఆఫీసుదాకా నడిచి, అక్కడ మలుపు తిరిగి - చింతల పక్కగా ఒంటిగా నిలబడిన ఇంటికి వచ్చేశాడు రాజు.

అదే ప్రతాపరెడ్డి ఇల్లు. పలకరాళ్ళ గోడలూ, వాటి పైన రెల్లు కప్పు. క్రింద కడపరాళ్లు. మధ్య స్తంభానికి మధ్యగా గూట్లో దీపం గుడ్డి వెలుగునిస్తోంది. వసారాకూ, లోపలి గదికీ మధ్యగా వున్న గడపమీద కుడివైపు ద్వారబంధానికి ఓ రెండంగుళాల దూరంలో మరో బుడ్డి పెట్టివుంది. దాని గ్లాసు ఒకవైపు పగిలి వుంది. గాలికి రెపరెపలాడుతోంది, వత్తినుంచీ వస్తున్న సన్నని కాంతి.

ఇల్లు సాంతం మౌనంగా వుంది. అన్నాలై పోయినై.

పిల్లలు పడుకున్నారు.

వసారాలో మంచంమీద ప్రతాపరెడ్డి పడుకునివున్నాడు. అతని పక్కగా - నేలమీద - ఈతాకుల చాపమీద - అతని భార్య చిన్నమ్మ కొంగు పరచుకుని పడుకుని వుంది.

రాజుని చూస్తూనే లేచి కూర్చుంది, చిన్నమ్మ.

" రా - అన్నా " అంటూ స్టూలుని గోడవారగా లాగింది. వచ్చి కూర్చున్నాడు, రాజు.

" నేను ఎన్నికల్లో నిలబడుతున్నాను ప్రతాపా " అంటూ సూటిగా విషయం చెప్పాడు, రాజు.

" నిజమా ? " అంటూ ఆశ్చర్యపోతూ, లేచి కూర్చు. న్నాడు - ప్రతాపరెడ్డి.

" అవును. నేనీ బాధని భరించలేను. ఇంతమంది ఆడా మగా, పిల్లాపితుకూ - బిందెడు నీళ్ళకోసం - ఆమడదూరం రోజూ - పడుతూ లేస్తూ పోవడం చూడలేకపోతున్నాను. "

C. P. BROWN MEMORIAL
LIBRARY, CUDDAPAH
Acc. No 3014



రాజు క్షణంసేపు ఆగి ప్రతాపరెడ్డి మొహంలోకి చూశాడు.

అవునన్నట్టు తల ఆడించినాడు ప్రతాపరెడ్డి.

" మన వూళ్ళో వాన కురవదు. చెరువు నిండదు. చెరువు ఎండిపోతే పల్లె మొత్తానికీ తాగే నీరు కూడా వుండదు "

చిన్నమ్మ లేచి లోపలికి వెళ్ళింది. " కోడూరు నీళ్ల కావళ్లలో మోసిమోసి ఎంతమంది మగాళ్ల బుజాలు కాయలు కాసినై. ఎంతమంది ఆడపడచుల నడ్డి వంకరపోతోంది."

చిన్నమ్మ లోపలినుంచీ వచ్చింది.

"తీసుకో అన్నా " అంటూ మజ్జిగ గ్లాసుని రాజు చేతికి అందించింది.

గ్లాసుని అందుకుని గటగటా త్రాగేశాడు రాజు. ఖాళీగ్లాసుని స్తంభం పక్కగా పెట్టాడు.

" ఎన్నితరాలు గడిచిపోవాలి ఇట్టా? దీనికి శాశ్వతంగా పరిష్కారమే లేదా? నాకు కడుపు రగిలిపోతోంది. తలచుకున్న కొద్దీ గుండె పిండుకుపోతోంది."

రాజు భావావేశానికి ప్రతాపరెడ్డి విచలితుడైనాడు. అతను విశ్లేషించి చూపిస్తున్న వాస్తవానికి అతనికేసి బిక్కరించి చూడసాగేడు.

త్రుటికాలం ఆగి మళ్ళీ చెప్పసాగేడు, రాజు.

" మా నాన్న బతికుండగా చెప్తూ వుండేవాడు-"వ్యవసాయ పనుల్లో ఎంత శ్రమ చేసినా బాధ వుండదురా, ఈ నీళ్ళ కావిళ్ళ

మోయడమంటే యాసరిక వస్తోంది" అని. ఇంక మా అమ్మ సంగతి మీకు తెలియనిదేం వుంది. పక్షవాతం వచ్చి మంచాన పడి తీసుకు తీసుకు పోయింది."

"అత్తమ్మ పడిన బాధ మాకు తెలీనిదా అన్నా" అంటూ బాధపడింది చిన్నమ్మ.

రాజుకు కంఠస్వరం మారింది. విసుగ్గా అన్నాడు. "ఊళ్ళో పెద్దల్ని కదిలిస్తే ఎవరికీ కాబట్టదు"

ఆ క్షణాన్న — రాజుకు ఊరి సంగతితోపాటు తన జీవితానుభవాలన్నీ గుర్తుకొచ్చాయి. ఇప్పటివరకూ — ఆ చేదు అనుభవాలన్నీ మనస్సులో ఏ మారుమూలనో చీకటి కోణాలలో దాగి వున్నాయి. వాటినుంచీ ఇకనైనా తప్పించుకోవాలనే ప్రగాఢమైన వాంఛ అతని మాటల్లో కనపడింది, ప్రతాపరెడ్డికి.

రాజుని మామూలు మనిషిని చెయ్యడానికి ప్రతాపరెడ్డికీ చిన్నమ్మకీ చాలాసేపు పట్టింది. ఇద్దరూ అతనికి ఉపశమనం కలిగించే మాటలు చెప్పారు.

"తప్పకుండా దీన్ని గురించి పని చేద్దాం" అని భుజం తట్టాడు, ప్రతాపరెడ్డి.

"ఎన్నికల్లో నిలు. మనోళ్లందరికీ చెప్పి నీకే చేయిస్తాను" అనే భరోసా కూడా ఇచ్చాడు.

నిమ్మళంగా లేచి కదిలేడు రాజు.

చిన్నమ్మ అతనికి వినబడేటట్లుగా అంది, "అన్నది సుగిచ్చిన ప్రాణం. సాచాగా మాట్లాడతాడు, సాచాగానే బతుకుతాడు."

* * *

అనుకున్నట్టుగానే ఎన్నికలొచ్చాయి.

రాజు గోదాలోకి దిగేడు.

రాజుకీ నరసయ్యకీ ముఖాముఖీ పోటీ.

నాయుడిగారి బలగమంతా నరసయ్య పక్షాన నిలిచారు. పల్లె చరిత్రలో ఇదీ విశేషం. బద్ధ శత్రువులిద్దరూ రాజు వలన మిత్రులుగా మారిపోవడం – చూసిన వాళ్ళకి ఆశ్చర్యాన్ని గొల్పింది.

సైకిలొకటి ముదలంకించుకుని శివారు గ్రామాలకి కూడా పోయి ప్రతి వోటరునీ కలుసుకున్నాడు, రాజు. ప్రతాపరెడ్డి యితర యువకులూ అతని పక్షాన్న బాగానే పని చేశారు.

చివరికి – మంచి నీళ్ల సమస్యే ఎన్నిక ఫలితాన్ని నిర్ణయించే విధంగా కుదురుకుంది పరిస్థితి.

వాతావరణం వేడెక్కి, ప్రచారం తారాస్థాయికి చేరుకునే సరికి – ఊరూ వాడా – రాజు గెలుపు ఖాయమని అభిప్రాయ పడింది.

పెద్ద సంఖ్యలో వోటర్లున్న గూడెం పెద్దలు రాజుపట్ల సుముఖంగా వున్నారనే వార్త – రాజుకు మంచి ఊపునిచ్చింది.

పోలింగ్ రేపనగా నరసయ్య కారు తెప్పించాడు. కారులో డబ్బు సంచులు వచ్చినై. డబ్బు సంచుల వెనగ్గా కాపు సారా దుమికింది. ఆ వెంటనే పొట్లాళ్లు తెగినై.

పండగ జరిగింది – తిరణాలలాగా. రాత్రి పది దాటింది.

ప్రళయానికి ముందు ప్ర శాం తి ని సంతరించుకుని ఓ కునుకు తీసింది – ఊరు.

మర్నాడు —

పోలింగ్ ప్ర శాం త ం గా జరిగింది. కాకుంటే, అక్కడక్కడా వాగ్యుద్ధాలూ, రాళ్ళు విసురుకోవడాలూ కనబడినై.

రెండోరోజు వోట్ల లెక్కింపు జరిగింది.

పెద్ద మెజారిటీతో ఎన్నికైనాడు – రాజు !!

నరసయ్య జుట్టు పీక్కున్నాడు. నాయుడు పళ్ళు కొరికేడు. బలగమంతా పెదవులు బిగబెట్టారు !

రాజుకు ఉత్సాహం బుగ్గ పుట్టివట్లు లేచింది. ప్రతాపరెడ్డి ఆనందంతో కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. యువ మిత్రులంతా పరస్పరం బుజాలు తట్టుకుని, కరచాలనాలు చేసుకున్నారు.

తూగిస్తానా లేదా అనుకుని సందేహించిన రాజుకు - తనకూ కొంత శక్తి వున్నదనే ధైర్యం కలిగింది.

చిన్నమ్మ – గూడేనికీ, వూరికీ ఆ రాత్రి పప్పన్నం పెట్టింది.

బీదా బిక్కీ పై గుడ్డలు ఎగరేసి కోలాహలంగా రాజుకు జై కొట్టూ కదిలినారు !

*  *  *

ఇల్లలకగానే పండగ కాలేదు. రాజు – లక్ష్యంకేసి నడక మొదలెట్టాడు.

అంగుళం అంగుళమూ నట్లూ బోల్టులతో సంకీర్ణంగా వున్న పాలక యంత్రాంగాన్ని దగ్గరగా చూడసాగేడు.

మంచినీటి సమస్యని నెత్తిన పెట్టుకుని సహనం చెప్పుల జతని తొడుక్కుని జిల్లా కేంద్రానికి బయల్దేరాడు.

ఒకటో నెంబరు లిస్టులో వున్న తమ పల్లెకు ఇప్పటికి చాలాసార్లు బోరింగ్ కొట్టించామని జవాబు వచ్చింది.

చూడవలసిన వాళ్ళని అందర్నీ చూశాడు. ప్రదర్శించ వలసిన తెలివితేటల్ని తనకున్న ఎమ్మెల్యే స్థాయిలో ప్రదర్శించాడు.

కొన్ని నొసళ్ళు వెక్కిరిస్తే, కొన్ని పెదవులు పరిహసించినై.

ఒకరిద్దరు అనుభవశాలులు ఉచితంగా సలహా యిచ్చేరు, " నీకెందుకయ్యా ఈ బాధలన్నీ, మీ నాయుడిగారిని చూసుకో మను. ఆయనకీ వ్యవహారాల్లో సమర్థతా వుంది ; అనుభవమూ వుంది. "

మునాసగా సాగించిన రాజు కృషి ఒక కొలిక్కి రాలేదు. అయినవాళ్లంతా కలిసికట్టుగా కూర్చుని తలలు పట్టుకున్నారు. రాజూ, ప్రతాపరెడ్డీ – దిగులు మేశారు.

నాళ్ళు గడుస్తున్నై.

ఊరికి శని పట్టిందని అనుకోవడం, రాజుని గురించి గొణుక్కోవడం మొదలైంది.

"పేదవాడి కోపం" ఎక్కువకాసాగింది రాజుకు.

మంచినీళ్ళ సమస్యను ఎలా పరిష్కరించగలనా అనేది అతని అణువణువునా నిండిపోయింది. వాయుభక్షణ చేస్తూ గడ్డం పెంచుకొని, శరీరాన్ని చిక్కి శల్యం చేసుకున్నాడు. తనలో తాను కుములుకొని ఏడ్చినాడు.

ఉన్నట్టుండి —

చీకటి గుయ్యారంలో వెలుగురేఖ తోచింది రాజుకు.

ప్రవాహంలో కొట్టుకుపోతున్నవాడికి గడ్డిపోచ దొరికినట్లయింది.

గుప్పిట బిగించి నిటారుగా లేచాడు !

*   *   *

తెలతెలవారుతుండగా ప్రతాపరెడ్డి యింటికి వెళ్ళాడు, రాజు.

వీధి అరుగుమీద కూర్చుని పండ్లు తోముకుంటున్నాడు, ప్రతాపరెడ్డి. అరుగుకు మరో చివర బోకులు తోముతోంది చిన్నమ్మ.

స్తంభాన్ని ఆనుకుని కూర్చున్నాడు రాజు.

"నేను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను ప్రతాపా" అన్నాడు రాజు. అతని స్వరంలో తెగింపు వుంది.

రాజుని తేరిపార చూశాడు, ప్రతాపరెడ్డి.

అతనికి విషయం అర్థమైంది. క్షణాల తర్వాత అన్నాడు, "మంచి నిర్ణయమే. రామాయపట్నం వాళ్లు నిన్నటిదాకా తిరిగిపోతూనే వున్నారుగా. కబురుచేద్దాం."

అదే తన వుద్దేశ్యమూ అన్నట్లు తలవూపేడు రాజు.

"మంచి సంబంధం వాళ్ళది. పిల్ల బంగారం బొమ్మ" అని మురిసింది చిన్నమ్మ.

* * *

పెళ్ళి అయిపోయింది. ఊరంతా మొహం మాడ్చుకుంది. అయినవాళ్లల్లో కొందరూ, కాని వాళ్ళల్లో అందరూ – రాజుని గురించి పెట్టుకున్న ఆశలన్నీ వమ్మయిపొయ్యాయని సణుక్కున్నారు.

"కొత్త కాపురంతో సరిపోతుంది. ఈయనింక మనల్ని ఉద్ధరించేదేం వుంది?" అని చెవులు కొరుక్కున్నారు.

కేన్వాసు లేని చిత్రాల్ని చదవడం మొదలెట్టింది ఊరు!

రెండు వారాలు గడిచినై.

ఆ వేళ —

ఉదయం పదిగంటలకు —

పట్నంనుంచీ ఒక భూగర్భ పరిశోధకుణ్ణీ, ఒక శాస్త్రిగారినీ తీసుకుని ఊళ్ళో దిగేడు, రాజు. ప్రతాపరెడ్డీ, ఇతర మిత్రులూ అతని వెనగ్గా నడిచేరు.

సాయంత్రమైంది. పరిశోధనలూ, పరిశీలనలూ పూర్తయినై.

గూడెం మధ్యలో ఒక పాయింటూ, పల్లె మధ్యలో ఒక పాయింటూ ఖాయం చేశారు.

ఊరంతా గుప్పుమంది - ఊరికి బోరింగులు వస్తున్నాయని!

రాజు పట్టుదలగలవాడు అనుకున్నారు, అదే జనం!

ఆ రాత్రి —

ప్రతాపరెడ్డి ఇంట్లో అంతా సమావేశమై విషయాలు చర్చించుకున్నారు. యాభై వేలు కట్నం డబ్బునీ దీనికి ఖర్చు చేస్తున్నానన్నాడు, రాజు. అయినా, సుమారు మరో పదిహేను ఇరవై వేలు కావాలని తేల్చేరు. మూడెకరాల వెలిపొలం అమ్మేస్తా నన్నాడు రాజు. అతని తెగువకు ముక్కున వేలేసుకున్నారు — మిత్రులంతా ! ఇంకా కొరవడితే తన భూమిని ఆయకం పెట్టి సర్దుతానని చేతిలో చేయి వేశాడు - ప్రతాపరెడ్డి

నాలుగోరోజు కొబ్బరికాయ కొట్టి రిగ్గుని పనిలోకి దించితే, ఐదోరోజు సాయంత్రానికల్లా పాతాళ గంగమ్మ పైపైకి ఉబుకి ఉబికి, పొంగి పొంగి వచ్చింది.

ఊరంతా ఉత్సాహం, ఆనందం, పండగ, కోలాహలం !

ఏ నోరు విన్నా రాజు త్యాగం గురించిన మెచ్చుకోలే !

నాయుడికీ, నరసయ్యకీ గుండెవ గంటు పెట్టినట్లైంది. అత్త పుట్టం అల్లుడు దానం చేశాడ్లే అని ఎకసక్కెం చేశారు.

పత్రికల్లో ప్రముఖంగా వచ్చేసింది - ఈ వార్త.

ఆనందంతో గుండెల్ని పండించుకున్నాడు రాజు. భర్త సంతృప్తిని చూసి కళ్ళు చెమర్చినై - వరమ్మకి !

పెళ్లాన్ని తీసుకుని రామాయపట్నం వెళ్లాడు రాజు.

వెళ్ళిన వారానికే ప్రతాపరెడ్డి నుంచీ ఉత్తరం వచ్చింది - ఉన్నపాటున వెంటనే తిరిగిరమ్మని.

ఒక్కడూ వచ్చేశాడు.

పొగలూ సెగలూ కక్కుతోంది, ఊరు.

పదిమందిదాకా ఆస్పత్రిపాలైనారు. గూడెంవాళ్ళూ, పల్లెలోవాళ్లూ కొట్టుకున్నారు. పెద్ద గలభా జరిగింది. కాళ్లూ అరుచుకొని గడ్డల్లా పొడుచుకున్నారు. పామూ ముంగిసలై పోయి పట్టు సడలకుండా గింజుకుంటున్నారు.

అంతా ఆకళింపు చేసుకున్నాడు రాజు. అతని కళ్లవెంట నీళ్ళు !

గూడెం బోరింగు హెడ్‌ని ఊడదీసుకుపోయారు, నీటి గొట్టంలో కంకర్రాళ్లు కూరేశారు ! ఎవరు ? ఎవరో !! అది మూలం. దానికి జవాబు - పల్లెలో బోరింగుకూ అదే గతి పట్టించడం ! అది చర్య, ఇది ప్రతిచర్య !!

నివురుగప్పిన నిప్పులా వున్నై - అందరి గుండెలూ. తన శరీరాన్నీ తలనీ వేరుచేసినట్లనిపించింది రాజుకు !

* * *

రాత్రి ఎనిమిది గంటలైంది.

ఊరుమీదపడి జులుం ఛలాయిస్తున్నది – చీకటి.

కాలువ గట్టున మద్దిచెట్టు క్రింద కూర్చుని ఆలోచనల్ని మేస్తున్నాడు రాజు.

తానిప్పుడు ఒంటరివాడు ! నోటిముందటికి అందించిన ముద్దని కూడా లాగేసే శక్తులు ఉన్నట్టు తెలుసుకుని తానుగా మిగిలిపోయిన ఒంటరివాడు !

తనను చూసి నలుగురూ నాలుక బయటపెట్టి వెక్కిరిస్తున్నట్టనిపిస్తోంది, రాజుకి ! పట్టుకుని బలవంతాన ముఖాన్న మసి పూసినట్లూ అనిపిస్తోంది !

“ రోగం కుదిరింది ముండాకొడుక్కి. డబ్బా పోయి శనీ పట్టింది. లేకపోతే ఊరికి నీళ్ళిప్పిస్తాడంట ! ”

“ పెద్ద భగీరధుడు దిగొచ్చాడు ! ఇప్పుడే ఏమైంది మన సంగతి ముందుముందు చూస్తాడు - కుర్రవెధవకి ఉండేల్ దెబ్బ తెలీదు ”

ఎవరో పగలబడి నవ్వుకుంటూ పోతున్నారు !

ఉలిక్కిపడి, కళ్ళు విచ్చుకుని మరీ చూశాడు, రాజు.

ఆకారాలు చీకట్లో కలిసిపోయినై. అయినా ఆ నీడలూ క్రీనీడలూ అతనికి అంతుబట్టనివికావు !

రాజు మేధస్సు మొద్దుబారిపోయింది.

తనది ఇంతటి గతితప్పిన కరుణా అనేది - అతన్నిప్పుడు కుంగదీస్తున్న ప్రశ్న ! ఆ ప్రశ్నలోని లోతుల్ని కొలువలేక పోతున్నాడతను !

భుజంమీద చెయ్యిపడింది - చల్లగా అనునయంగా ! చూశాడు. ప్రతాపరెడ్డి !

మూగకళ్ళు మాట్లాడుకున్నై.

వణుకుతున్న రాజు చేతిని పట్టుకున్నై - ప్రతాపరెడ్డి చేతులు.

" ఏపుగా ఎదిగిన బంతిమొక్కల్ని పిచ్చిగొడ్లు కుమ్మెయడం నువ్వూ నేనూ ఎన్నిసార్లు చూడలేదు - పద " అన్నాడు ప్రతాపరెడ్డి.

నిర్లిప్తంగా ఆకాశంకేసి చూశాడు రాజు. దూరంగా తార ఒకటి తెగి పడిపోతున్నది. దాని వెనగ్గా - వూరికి సమకూరుద్దామని కలలుగన్న విద్యుద్దీపాల వరుస, తన ఆశల బారులు కూడా - ఒక్కొక్కటి రాలి పడిపోతున్నట్టు కనపడింది!

" అవును. నేను పొరపాటున పరుల ఇంట్లోకి ప్రవేశించాను " అంటూ తనలో తాను గొణుక్కున్నాడు రాజు !

0~0~0